1. విందుగృహమునకేగి – వీక్షింతు భ్రమతో నీ – వివిధసుభోజ్యంబులన్ = విచ్ఛిన్నమైన నీ – విమల దేహపు విందు – వికలంబౌ మనసుతో – వినుతించి, తినుచుందు ॥జీవా॥

2. రుధిర ధారలలోన – ఋజువౌ నీ ప్రేమలు – రూపుమాయును పాపము= ఋతద్రాక్ష వల్లీ నీ – రుధిరపానముచేత – ఋణభారములు దీరి – రుచి యించు నా బ్రతుకు ॥జీవా॥

3. భవదీయ స్మరణార్థం – పతితుల శరణార్థం – ఫలియించు యాహోమము= ప్రభువా నాయాత్మలో – ప్రతిబింబమై వెలసి – పానార్పణంబౌను – ప్రతిరక్త బిందువు ॥జీవా॥

4. ఆత్మాంతఃపురములో – ఆంతర్య గదిలోన – ఆరాధింతు నీ నామము = అలనాటి నీ రక్త – నవనిబంధన నేడు – అపురూపమై నాలో – నవతరించును దేవా ॥జీవా॥

–ఏ. బి. మాసిలామణి

## 279 ప్రభు రాత్రి భోజన మాచరించునపుడు దీవెన గోరుట

రా – హుసేని (చాయ :దేవా యాశీర్వదింపుము) రా – త్రిపుట

దేవా దీవించు మిప్పుడు – దీన జనాళిన్ – గావ రా రమ్మెల్లప్పుడు = నీ వరగద్దెచుట్టు – నిజ దాసు లిటులఁ గూడి – పావన సంస్కారమును – బంచి పాలొందుచుండ ॥దేవా॥

1. మముఁ గావ నైదు గాయముల్ – బొందిన దేవ – సముఁడా నీ రక్త కాయముల్ = విమలంపు భక్తి ద్వారా – వీక్షించి మనసులందు – అమిత దుః ఖ మొందుటచే – నలిగిన భక్త జనులన్ ॥దేవా॥

2. నీ రాజ్యమునకు మముఁ జేర్ప – నిజము మా పాప – ఘోర శాపమ్ములన్ దీర్ప = నోరిమిచే మా కొరకు – దారుణముగ నొందిన – క్రూర మరణమును దలఁచి – కుములుచున్న హృదయులను ॥దేవా॥

3. కోరి నినుఁ గొలుచు భక్తుల – కోరిక లభివృద్ధి – గా రాజిలఁజేయు శక్తుల = ధారాళముగ నొసంగు – ధనాత్ముండ నీ దివ్యా – కార మందుండి యీ సం – స్కార సమయమున మమ్ము ॥దేవా॥



4. మా దారిద్ర్యములు బాపనే – పాపభారంపు – మ్రాను నీ దివ్య మూపుననే = గాదిలిచే భరియించి గడి దొంగ లిరువురిలో – బాధ లొందితి వనుచు – బహుగా దుఃఖించు మమ్ము ॥దేవా॥

5. నీ వీ విధంపు మరణముచే – నిజముగా మమ్ము – జీవింపఁజేసి నిల్పుటచే = పావనదేవ మే మీ – ప్రభు సంస్కారమ్ము మా మా – జీవాత్మ లాదరణకై – జే మనముగఁ గైకొనను ॥దేవా॥

– మురారి దావీదు

## 280 ప్రభురాత్రి సంస్కారవిందు

రా – కేదారి (చాయ :సోదరులారా గనుడీ యాశ్చర్యం) తా – అట

చేరి భుజియింపుడీవిందు – యేసు – సిద్ధపరచిన కృపావిందు = తోరణంబగు మేడ గదిలో – జేరి శిష్యుల తోడ సిలువ = భారమున్ మదినెంచి నెరపిన – భావ
గర్భితమైన విందు ॥చేరి॥

1. జీవాహారము దైవసుతుడే – పరమ – జీవజలముల దాత యితడే = జీవనాథుని రక్త – మేనులు – జీవానాహారములు కాగా = చావును దొల గించి మృతులస – జీవులనుగా మార్చువిందు ॥చేరి॥

2. కారుణ్యనిధి యేసు రాజు – నరుల – గావగ బలియైన రోజు = భారమైన సిలువ కెరయై – పాప భారము పరిహరింప = ధారవోసిన పుణ్యరక్తపు – ధారలన్ దలపోయు విందు ॥చేరి॥

3. దాసగణముల బ్రోవనెంచి – రుధిర – ధారలను గార్చిభరించి = భాసు రంబగు నవ నిబంధన – జేసి సంఘ పునాది వేసి = వాసి మీరగ నిత్య జీవము – బోసినట్టి యేసు విందు ॥చేరి॥

4. పాప పరిహారార్థముకై – క్రీస్తు – పడిన ఘోరబాధ కొరకై = యేపు దనరగ స్తుతులుబాడుచు – యేసునాథుని రాకవరకు = ఆపకుండగ సత్ప్రసాదము – నందుకొని బలమొంద రండి ॥చేరి॥

5. విందుతో మొదలిడిన సేవ – యేసు – విందుతో ముగియించె బ్రోవ = విందులోగల మర్మమేదియొ – విపులముగ బోధించు క్రీస్తున్ = డెందమున ధ్యానించి యాయన – యందె నమ్మిక గలిగియుందము ॥చేరి॥

–వి. డి. జాన్ సుందరరావు